6

# జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము

## (1 రాజులు 18:41-46)

ఏలీయా బయలు ప్రవక్తల పై సవాలు చేసి 450 మందిని హతమార్చిన సంఘటన అతని జీవితంలో ఎంతో గొప్పదని అనేకులు భావిస్తారు. కర్మెలు మీద జరిగిన గొప్ప ప్రదర్శనం గురించి మనం చదివినాము. ఆకాశంనుండి అగ్ని దిగి రావడం గురించి ప్రజలు "*యెహోవాయే* దేవుడని" కేకలు వేసిన దానిని గురించి మనం చదివినాము. చివరకు అబద్ధ ప్రవక్తలను చంపడం గురించి కూడ చదివాము. ఈ సంఘటన జరిగిన అనంతరం ఈ అబద్ధ ప్రవక్తల మృత దేహాలు కీషోను వాగు ఒడ్డు మీద కుప్పలు కుప్పలుగా పడియుండటం అహాబు రాజు చాటంత కళ్ళుచేసుకుని నిస్సహాయంగా పారజూట్టం జరుగుతుంది. ఈ అధ్యాయం చివరకు వచ్చే సరికి "దేవుళ్ళ యుద్ధంతో" ముగుస్తుంది కాబట్టి, యింతటితో ఈ కథకు తెరపడింది అని మనం భావించవచ్చు.

అదేమికాదు; అసలుసిసలైనది యింకా మున్ముందు జరగబోయేది ఎంతో ఉంది. 1 రాజులు 18:1 చూద్దాం: "అనేక దినములైన తరువాత మూడవ సంవత్సరమందు, యెహోవా వాక్కు ఏలీయాకు ప్రత్యక్షమై *నేను భూమిమీద వర్షము కురిపించబోవుచున్నాను* 'నీవు వెళ్ళి అహాబును దర్శించుమని సెలవియ్యగా.' " (నొక్కి చెప్పింది నాది.) ఇక్కడ 18వ అధ్యాయమంతయు వర్షము పంపించడం గురించే చెప్తుతుంది. వర్షం రాకముందే ఏలీయా వెళ్ళి అహాబును దర్శించాలి. ఇశ్రాయేలీయులందరిని కర్మెలు పర్వతం మీద సమకూర్చాలి, ఆ జాతి యావత్తు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేయాలి. అది గనుక ఒక్కసారి చేసి ముగించినట్టయితే యివ్వబడిన వాగ్దానం నెరవేరుతుంది.

ఆ వాగ్దానం ప్రార్థనకు జవాబుగా జరగడం మనం చూస్తుండగా ప్రార్థన అనే అంశం మీద 1 రాజులు 18:41-46 వరకు ఒక పాఠం నేర్చుకుంటాము. దాన్ని సూక్ష్మంగా చూస్తే అదే, "జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము" అని గ్రహిస్తాం.

ప్రార్థనను గురించిన ఒక గొప్ప విషయం చెప్పమని ఎవరైనా అడిగినారనుకోండి? బహుశ మనం యేసును గురించిగాని పౌలును గురించికాని చెబుతాం. మనం గనుక పాత నిబంధనకు పరిమితమై చెప్పాలంటే, దావీదును గూర్చి చెబుతాం. యాకోబు తన పత్రికలో యీ విషయం అంతగా పట్టించుకోలేదు.

యాకోబు తన పత్రికలో తను ఎంపిక చేసుకున్న దాన్నిబట్టి రెండు సత్యాలు మనం గుర్తుంచుకోవాలి: (1) యాకోబు పత్రిక చాలా చిన్నదైనప్పటికి దాంట్లో ప్రార్థన గురించి క్రైస్తవులకు యివ్వబడిన హితవు మరే పత్రికలోను కనబడలేదు, మరియు (2) యాకోబు

సైతం వ్యక్తిగతంగా గొప్ప ప్రార్థనా పరుడు. అనేక గంటలు అతను ప్రార్థనలోయుంటాడు కాబట్టి, అతని మోకాళ్లు ఒంటె మోకాళ్లులాగ కాయలుకాసి కందిపోయి ఉంటాయని చరిత్ర అంటుంది.

యాకోబు ఎవరిని ఎంపిక చేసుకుంటున్నాడు?

> నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలము గలదై యుండును. ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సరముల వరకు భూమి మీద వర్షింప లేదు. అతడు మరలా ప్రార్థన చేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను (యాకోబు 5:16-18).

యాకోబు ఏలీయాను ఒక మాదిరిగా తీసుకున్నాడు. యిక్కడ ఏలీయా జీవితం నుండి కొన్ని ముఖ్యమైన సంఘటనలను ఎలా ఎంపిక చేసుకున్నాడో గమనిద్దాం: అతను ఆ చనిపోయిన బాలుని లేపడం, లేదా ఆకాశంనుండి అగ్ని కురిపించడం కాదు, కాని వర్షాన్ని ఉన్నపాటున ఆపివేసిన ప్రార్థన, వర్షాన్ని మరలా కురిపించిన ప్రార్థనయే.

యిక్కడ మనం 1 రాజులు 18:41-46 మరియు యాకోబు 5:16-18 ఈ రెండు వాక్యభాగాలు కలిసి మనం చదివితే, "జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము" కనిపెట్టగలం.

## శక్తివంతమైన ప్రార్థన

ఈ కథకు ఒక్కసారి పునర్విమర్శ చేసుకుందాం. యిక్కడ ఏలీయా మనిషికి దూరంగా ఉంటూ మనిషిని ఎదుర్కోవడం చూస్తున్నాం. యిక్కడ అతడు దేవునితో సంభాషించడం మనం చూద్దాం.

"ఏలీయా అహాబుతో, 'నీవు ఇప్పుడు వెళ్ళుము, తినుము త్రాగుము' " (1 రాజులు 18:41ఎ) అంటున్నాడు. వాస్తవానికి ఆ సమయంలో అహాబు, ఏలీయాలు బయలు ప్రవక్తలతో ఆ పర్వతం క్రింది భాగంలో కీషోను వాగు దగ్గరవున్నారు. బహుశ అతను భోజనమే చేయలేదు అని చెప్పాలి. ఏలీయా ఏమని చెబుతున్నాడంటే, "వెళ్ళి నీవు భుజించి బలపడుము" అని.

ఇది అతను బయలు ప్రవక్తల పట్ల తాను ప్రవర్తించిన ప్రవర్తనకు విభిన్నంగా ఉన్నది! "ఈ మనుష్యుడు యెజెబెలును వివాహం చేసుకోడానికి కారకుడు, ఆమెగారేమో ఈ బయలు ప్రవక్తలందరిని తీసుకు రావడానికి కారకురాలు. ఇప్పుడైతే ఆ అబద్ధ ప్రవక్తలు చచ్చారు, అహాబు భుజించి ఆనందించడానికి పిలువబడుచున్నాడు. అబ్బే అదేమంత బాగలేదే! అని మనం ఆక్షేపిస్తాం."

యిక్కడొక విషయాన్ని మనం గుర్తించాలి: పాత నిబంధనంతటిలో దేవుని అభిషేకం పొందిన నాయకులు ఎంతో గౌరవించబడినారు (దావీదు సౌలును ఎంతో గౌరవించాడు ఎందుకంటె "ఇతడు యెహోవాచేత అభిషేకము నొందినవాడు" 1 సమూయేలు 24:10; etc.). ఒకవేళ మనిషి మంచివాడు కాకపోవచ్చు కాని దేవుడతనికి ఆ ఘనతను యిచ్చాడు కాబట్టి దాన్ని బట్టి అతన్ని గౌరవించాల్సి ఉంది. క్రొత్త నిబంధనలో కూడ అంతేవుంది, మన మీద నియమించబడిన అధికారులు పవిత్రులని కాదుగాని వారిని దేవుడు అధికార స్థానంలో

నియమించాడు కాబట్టి మనం వారిని గౌరవించాలి (రోమీయులకు 13:1ff).

ఏలీయా యింకా యిలా అంటున్నాడు, "విస్తారమైన వర్షము వచ్చునట్లుగా ధ్వని పుట్టుచున్నది" (వచనం 41ఎ). అదేదో బాహ్యంగా వినబడే శబ్దం కాదు. ఆకాశంలో చారడంత మేఘం కూడ కనబడ్డంలేదు (గమనించు 43 వచనం). ఏలీయా తనయొక్క విశ్వాసపు చెవులతో ఆ శబ్దం విన్నాడు. "నీవు వెళ్ళి అహాబును దర్శించు, నేను భూమిపై వర్షము కురిపింపబోవుచున్నాను" (1 వచనం) అని దేవుడన్నాడు. దేవుడు చెప్పిన దానిని తూచతప్పకుండ ఆచరించాడు ఏలీయా. అది వర్షము వచ్చు సమయము, ఏలీయా దానిని నమ్మాడు.

"అహాబు భోజనము చేయబోయెను గాని, ఏలీయా కర్మెలు పర్వతము మీదికి పోయి" (42ఎ వచనం). ఇద్దరు పర్వతము మీదకు పైకి వెళ్లినారు గాని ఏలీయా యింకాపైకి వెళ్ళాడు. వారు అలావెళ్లడంలోని రెండు రకాల వేర్వేరు కారాణాలున్నాయి: అహాబు భుజించడానికి వెళ్లినాడు, ఏలీయా ప్రార్థించడానికి వెళ్ళినాడు. "అతడు నేల మీదపడి ముఖము మోకాళ్లమధ్య ఉంచుకొనెను" (42బి వచనం). ఏలీయా మోకాళ్ల మీద పడి ముందుకు వంగి తన దేవునిముందు తలవంచుకొనెను. ఈ కథలో "ప్రార్థన" అనే మాట గాని, లేదా ఏలీయా అలా చెప్పాడు అనిగాని వాడబడలేదు. కాని వాక్య సందర్భంలో చూచినట్లయితే అతడు ప్రార్థన చేసినట్లుగా గ్రహించగల్గుచున్నాము, యాకోబు తన పత్రికలో కూడ దాన్ని దృఢపరుస్తున్నాడు (యాకోబు 5).

యిదే నేనేగనుకైతే, హాయిగా యింటికెళ్ళి విశ్రాంతి తీసుకునేవాణ్ణి. "బాగా లేటయింది. ఈ రోజంతా మంచిగా లేదు" అంటూ సాకులు చెప్పేవాణ్ణి. రేపు ఉదయం లేచిన దగ్గరనుండి కవాతు చేయాల్సివుంది కాబట్టి ఇవాల్టికి మాత్రం పూర్తిగా విశ్రాంతి తీసుకుందాం అనుకునేవాణ్ణి. ఏలీయా మాత్రం, ప్రార్థన చేయడానికి పైకెక్కి పోయాడు. మనం "వాగ్దానాల మీద నిలబడదాం" అని పాడతాం; ఏలీయా వాగ్దానముల మీద మోకరిద్దాం అంటున్నాడు.

"అతడు తన దాసునిని పిలచి – నీవు పైకి పోయి సముద్రము వైపుచూడుమనగా" (43ఎ వచనం). ఏలీయాకు ఒక సేవకుడు కూడ ఉన్నాడన్న సంగతి యిక్కడ మొట్టమొదటిగా చదువుచున్నాం. అతని గురించి కొన్ని వివరాలు వచ్చే అధ్యాయంలో నేర్చుకుందాం. అప్పుడే ఈ కథనుండి నిష్క్రమిస్తాడు. యూదా ఆచార వ్యవహారాల్లో చూస్తే ఆ సారెపతు విధవరాలి కుమారుడితడేనని అంటారు. ఇతన్నే ఏలీయా చావునుండి రక్షించింది.[1] సరే అతనెవరో ఏమోగాని, "నీవు వెళ్లి, సముద్రము వైపుకు చూడుము" అని యితనితోనే ఏలీయా చెప్పింది. ఇతడు ప్రార్థన చేసిన స్థలం గురించి చరిత్ర గ్రంథాలేమంటున్నాయంటే ఏలీయా ప్రార్థించుచున్న స్థలానికి ఆ సేవకుడు ఎక్కి పోయిన స్థలానికి పదిహేను, ఇరవై గజాల దూరమున్నదని అక్కడనుండి మధ్యదరా సముద్రం బాగా కనబడుతుందట.

అందువల్ల ఆ సేవకుడు వెళ్ళి చూడ్డం, " 'ఏమిలేదని చెప్పడం, మరలా' ఏడు మారులు" ఆ విధంగానే వెళ్ళవలసిందగా ఏలీయా అతనితో చెప్పడం చూస్తున్నాం (43బి వచనం). యిక్కడ ఏలీయా "ఆటలలో తర్ఫీదు" చేసేవాడు కాదు: ఒకటి, రెండు, మూడు, నాలుగు అంటూ పాయింట్స్ లెక్క చెప్పడానికి, ఈ విధంగా చేయడం ద్వారా అది మరలా మరలా తర్ఫీదు కోసం ఆడటం జరుగుతుంది. ఏలీయా ప్రార్థన చేసిన వెంటనే ఆ సేవకునితో "వెళ్ళి పరీక్షించు" అని పంపించాడు. ఆ సేవకుడు తిరిగి వచ్చి "అయ్యా ఏంలేదు" అని చెప్పాడు.

ఏలీయా యింకా కొంచెం సేపు ప్రార్థించిన తర్వాత “రెండవ మారు వెళ్ళి చూచి రావలసిందని” తన సేవకునితో చెప్పినాడు. వెంటనే సేవకుడు వెళ్లి చూచి “అయ్యా యింకా రాలేదు” అని చెప్పినాడు. కాబట్టి ఈవిధంగా మూడవసారి, నాల్గవసారి, ఐదవసారి, ఆరవసారి చివరకు ఏడవసారి కూడా జరిగింది.

“ఏడవ మారు అతడు చూచి – అదిగో మనిషి, చెయ్యి యంత చిన్న మేఘము సముద్రమునుండి పైకి ఎక్కుచున్నదనెను” (44ఎ వచనం). అది ఎంత చిన్న మేఘమంటే మనిషి చెయ్యంతది, ఐతేనేం ఏలీయాకు అది చాలు.

ఏలీయా యిలా అన్నాడు, “నీవు అహాబు దగ్గరకు పోయి – నీవు వెళ్లకుండ వర్షము నిన్ను ఆపకుండునట్లు నీ రథమును సిద్ధపరచుకొని పొమ్మని చెప్పుమని వానిని” పంపెను (44బి వచనం). ఈ సమయంలో ఏలాంటి సిద్ధపాటు అవసరమో నాకు తెలియదు. కొందరు ఏమని ఊహించారంటే, అహాబు ఆ రథానికి వర్షాకాలము గానులు (టైర్లు) తీసుకొనియైనా ఉండవలసింది లేదా అతని రథాన్ని ఎప్పటికప్పుడు వాతావరణాన్ని బట్టి మార్చుకోడానికి సంసిద్ధం చేసుకొని యుండాల్సింది అని, వాస్తవానికి అతడు అంతాసర్దుకొని సిద్ధంగా ఉండాల్సి ఉంది. అతడు కిషోను లోయ దాటి పోడానికి వెంటనేనన్నా మహాధ్వని లేనట్లయితే ఆ రాబోయే ప్రచండ వర్షానికి యెజ్రెయేలులో వీధులు దాటడానికి సైతం వీలులేకుండ పరిస్థితులు ఎదురవచ్చు.[2]

“అంతలో ఆకాశము మేఘములతోను గాలివానతోను, కారు కమ్మెను; మోపైన వానకురిసెను” (45ఎ వచనం). ఇదేదో అందరి కళ్ళ నీళ్ళు తుడవడానికి నాలుగు చినుకులు పడిన రీతి కాదు, ఆ పద్ద నాలుగు చినుకులకు అసలు నేల తడవనే తడవలేదు; కాని యిదొక “ప్రచండ వర్షము” అని నేనంటున్నాను. మరి మీరు మీ దేశంలో దీన్నేమని పిలుస్తారో నాకు తెలియదు సుమా!

“అహాబు రథమెక్కి యెజ్రెయేలునకు వెళ్లి పోయెను” (45బి వచనం). యెజ్రెయేలు అక్కడనుండి పదిహేను లేక ఇరవై మైళ్ళుంటుంది సమరయ ఇశ్రాయేలు దేశానికి రాజధాని కాని యెజ్రెయేలునందు రాజుకు మంచి భవంతి ఉన్నది,[3] అహాబు అక్కడికే వెళ్ళాడు.

“యెహోవా హస్తము ఏలీయాను బలపరచగా అతడు నడుము బిగించుకొని అహాబుకంటె ముందుగా పరుగెత్తుకొని పోయి యెజ్రెయేలు గుమ్మమునొద్దకు వచ్చెను” (46 వచనం). ఏలీయా తన పొడగాటి అంగీని ఎగబట్టి తన నడుమున ఉన్న దట్టిలోకి దూర్చుకున్నాడు ఎందుకంటె తన పాదాలు నిరాటంకముగా కదలడానికి. అహాబు తన రథంపై దూసుకొనివెళ్ళినాడు. ఏలీయా యింకా అతనికంటె చురుగ్గా పరుగెత్తి అతని కెదురుపడ్డాడు. ఆహా ఆ రోజున అది ఎంత అద్భుతమో కదా!

ఏలీయా ప్రార్థనకు ఎంత అద్భుతంగా జవాబు లభించింది. ఇక్కడ ఈ జవాబు దొరికిన ప్రార్థనకుగల మూడు ఫలితాలు గమనిద్దాం:

మొదటిగా, అది ఆ దేశాన్నంతా ఆశీర్వదించినది. “అదొక కుంబవృష్టి,” ఆ వర్షం దెబ్బకు చెరువులు, కాలువలు నదులు పొంగి పొరలి ప్రవహించాయి. నీటిమట్టం పొర్లి పారినది. ఆ దేశం సస్యశామలంగా మారింది. “ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను” (యాకోబు 5:18).

రెండవది, అది ఏలీయాను ఆశీర్వదించింది. ఏలీయా ఆ రథాన్నికంటె ముందు

వేగవంతంగా ఎలా పరుగెత్తగల్గినాడు? అదొక పెద్ద రోజు, విశ్రాంతి, విరామంలేని రోజు. వాస్తవానికి ఏలీయా ఏమి భుజించలేదు. 46వ వచనం "దేవుని హస్తం" అతని మీదవున్నది అని చెబుతుంది. ప్రార్థనకు అంత శక్తి ప్రభావాలున్నాయి. ప్రార్థన యితరులను గూర్చి ప్రార్థించినప్పటికి, ప్రార్థించు వ్యక్తిని ఆశీర్వదిస్తుంది.

మూడవదిగా, ఇది అహాబుకు ఆశీర్వాదకరంగా ఉండడమే కాదు, అతని ద్వారా ఆ దేశమంతటికి కూడ ఆశీర్వాదకరమే. అహాబు బతికిపోవుటను గమనించండి. ఆ రోజుల్లో జరిగిందంతా అతడు కళ్ళారా చూచాడు. మరలా దేవుని యొక్క అభిషిక్తునిగా తన పని పునః ప్రారంభించడానికి అతనికి మరొక్క అవకాశం యివ్వబడింది.

ఒక్క క్షణం, మీరు ఒక అహాబు అనుకొని వూహించండి. నీవు నీ రథంపై కూర్చుని ఉన్నావు, యెజ్రెయేలుకు తిరిగి వెళుతున్నావు. యిక ఇప్పుడిప్పుడే చీకటి పడుతుంది. ఆకాశమంతా మేఘాలతో చీకటిగా ఉంది. ఏదైనా చూడ్డానికి కూడ యిబ్బందిగా ఉంది, వర్షం కమ్ముకొస్తుంది, పెద్ద పెద్ద చినుకులతో నీ రాజు వస్త్రాలన్నీ తడిచి పోయాయి. చల్లని గాలులు వీస్తు నిన్ను స్పరిస్తున్నాయి. వాస్తవాన్ని అర్థం చేసుకోమన్నట్లు నిన్ను సంధిస్తున్నాయి. గతంలో జరిగిన సంఘటనలన్ని నీకు గుర్తొస్తున్నాయి. ఈ అడవి మనిషి ఏలీయా కనబడి తను చెప్పేవరకు భూమిపై వర్షం కురవదన్నాడు, అన్నవెంటనే ఈ భూమి కనుచూపు మేరలో ఎక్కడా కనబడలేదు. అప్పటినుండి మూడున్నర సంవత్సరాలు వర్షం కురవలేదు. ఒకసారి ఉన్నట్లుండి కనబడ్డాడు, అందరిని కర్మెలు పర్వతం దగ్గరకు సమకూర్చమని ఆజ్ఞ జారిచేశాడు. నీవు నీ జీవితంలో ఎప్పుడైనా యిలాంటి విషయాలు చూచియుండక పోవచ్చు: ఆకాశంనుండి అగ్ని దిగి రావడం, ప్రజల అరుపులు, 450 మంది బయలు ప్రవక్తలు చంపబడడం. "నేనేమి చేయాలి?" అని నీవనుకుంటావు.

నీవిలా ఆలోచనలో నిమగ్నమై యుంటే వెనుకాలనుండి చక, చక చకామంటూ ఎవరో నడిచి వస్తున్నట్లు వింటున్నావు. ఉన్నట్లుండి ఒక్క క్షణంలో చీకటిలో నుండి ఈ అడవి మనిషి వూడిపడ్డట్టు గమనిస్తావు. తలంతా వర్షంలో తడచి ముద్దయినట్లును అతని కాడి మానులాంటి కాళ్ళు పెద్ద పెద్ద అంగలేస్తూ నీముందు ఉండడం చూస్తావు. నిన్ను చూచి పండ్లికిలించుకుంటూ నిన్ను దాటుకుంటూ వెళుతూ చీకటిలోనికి మాయమవడం యిట్టే గమనిస్తావు. యిక రథమును వేగముతో లాగుకొనుపోవు మంచి గుఱ్ఱము నీకు కలదు.

యిదంతా అహాబు మనసునకు ఏమి కలిగించిందో నీవు ఊహించుకో!

ఏలీయా పరుగెత్తుకుంటూ వెళ్ళి యెజ్రెయేలు ముఖద్వారం దగ్గర వేచియుండి ఏమి జరగబోతుందో అని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాడు. ఆ దేశం గొప్ప మలుపు తిరగబోతుందని ఏదో ఒకటి సంభవిస్తుందని అతను తప్పక నిరీక్షణతోయున్నాడు. సర్వశక్తిమంతుడైన దేవుని శక్తితో బయలు మతం పై చావుదెబ్బ కొట్టాడు అతను.

ఈ కథ మనకేం బోధిస్తుంది? ఈ సంఘటన "ప్రార్థనలో" గొప్ప *శక్తియుందని* తెలుపుచున్నది, దేవుడు ప్రార్థనలకు జవాబునను గ్రహించువాడు అని యాకోబు స్పష్టంచేస్తున్నాడు: "నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై *బహు* బలముగలదై యుండును" (యాకోబు 5:16బి; నొక్కి చెప్పింది నాది). ఇక్కడ ఈ మూడు శక్తివంతమైన మాటలు జ్ఞాపకం చేసుకుందాం: ప్రార్థన "బలముగలదై" యుండును; ప్రార్థన ఒక పనిని "నెరవేర్చును"; మరియు ప్రార్థన "యింకా ఎక్కువవాటిని" కూడ నెరవేర్చును. తర్వాత

యాకోబు ప్రార్థనకుగల శక్తికి రుజువును మిగతా రెండు వచనాల్లో తెల్పుచున్నాడు:

> ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థనచేయగా మూడున్నర సంవత్సరములవరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థన చేయగా ఆకాశము వర్షమిచ్చెను భూమి తన ఫలము ఇచ్చెను (యాకోబు 5:17, 18).

దేవుడు ఏలీయా ప్రార్థన ఆలకించాడు, మరియు ఇమిడియున్న భావాన్ని బట్టి నీ ప్రార్థన నా ప్రార్థన కూడ ఆలకిస్తాడు – మనం ఈ పాఠాన్ని నేర్చుకోవాలి మన పిల్లలకు నేర్పించాలి కూడ.

తన పిల్లలకు ప్రార్థన గురించి నేర్పించాలని యిష్టపడిన వ్యక్తి తనకు అనగా ఒక తండ్రిగా తల్లిగా వారికి అందించబడిన అనుసరణీయమైన నిబంధనావళిని తప్పక అనుసరించిన విషయం గమనిస్తాం. ఒకతనికి మొట్టమొదటి కుమారుడు జన్మించినప్పుడు, అతడు అతని భార్య ఒక నోటు పుస్తాకాన్ని కొన్నారు. ఒక ప్రక్క "మేము అడిగినది" మరో ప్రక్క "అతడు జవాబు చెప్పినది" అని వారు వ్రాసారు. ఆ సంవత్సరమంత వారి పిల్లలతో కుటుంబ ప్రార్థనలో ఒక ప్రక్క తమ ప్రార్థనా మనవులు "మేము అడిగినది" అని వ్రాసారు. వారు ఒక ప్రార్థనా మనవికి జవాబు లభించిన వెంటనే దానికెదురుగా "ఆయన జవాబు యిచ్చినది" అని వ్రాశారు. చివరకు వారు వారి పిల్లలకు నేర్పించి స్పష్టం చేసినదేమంటే, దేవుడు మన ప్రార్థనలు ఆలకిస్తాడు "ఔను," "కాదు," లేదా "కొంతకాలం ఆగండి" అని జవాబిస్తాడని పిల్లలకు నొక్కి చెప్పారు.

ఏలీయా విషయంలో గనుక చూస్తే, అతని ప్రార్థనలకు దేవుడు సూటిగా "ఔను" అని జవాబివ్వటం మనకెక్కడ లేని ప్రేరేపణ కల్గుతుంది. ఇక్కడ నోట్ బుక్ ఉపయోగించిన వ్యక్తి "ఔను" అన్నదానికి ఒక ఉదహరణ యిస్తున్నాడు. అతడొక తండ్రి గురించి చెబుతూ అతను తనకున్న బిజినెస్‌నంతా పూర్తిగా బాగా నష్టానికి అమ్మివేశాడని పూర్తిగా దేవుని సేవ చేయడానికి అలా చేశాడని చెప్పినాడు. రానురాను అతనికి ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. ఒక రోజు వారి కుటుంబ ప్రార్థనలో అతని నల్గురు కుమారుల్లో చిన్న కుమారుడు టిమ్మి యిలా అడిగాడు, "డాడీ, నేను గనుక ఒక చొక్కా అడిగితే ఆయనేమన్నా అనుకుంటాడా?"

"లేదు ఏమనుకోడు" అని జవాబిచ్చాడు తండ్రి.

వెంటనే ఆ చిన్న నోట్ బుక్‌లో "టిమ్మికి ఒక షర్టు" అని వ్రాసారు. యిక వారి తల్లి మరీ క్రమం పాటించే వ్యక్తి కాబట్టి "దాని సైజు 7" అని వ్రాసింది. ప్రతి రాత్రి ఆ షర్ట్ కోసం వారంత ఖచ్చితంగా ప్రార్థించేటట్లు చూశాడు టిమ్మీ. యిలా ఒక వారం రోజులో ప్రతి రాత్రి ప్రార్థించారు.

ఒక రోజు టిమ్మీ తల్లిగారికి ఫోన్ వచ్చింది, ఫోన్ చేసిన వ్యక్తి ఒక క్రైస్తవ వాణిజ్యవేత్త. అతనికి డల్లాస్ పట్టణంలో ఒక పెద్ద షాప్ ఉన్నది. అతనంటున్నాడు "ఇవాళ జూలై నెలంతటిలో అమ్మకాల జాబితా లెక్కలు పూర్తి చేశాం. మీకు నలుగురు కుమారులున్నారు గదా వారికి ఉపయోగపడేదేదైనా ఉంటుందేమో అని నాకు ఆలోచన కలిగింది. అమ్మా పిల్లలకు కొన్ని చొక్కాలు యిస్తా వాడుకుంటారా?"

ఆ తల్లి అడిగింది "అయ్యా వాటి సైజెంత?"

"సైజు నెంబర్ 7."

"మీ దగ్గర ఎన్ని చొక్కాలున్నాయండి?"

వెంటనే వాణిజ్య వేత్త తడుముకోకుండ చెప్పాడు, "అమ్మా పన్నెండు అంటే ఒక డజను ఉన్నాయ్."

ఆ రోజు రాత్రి మరలా కుటుంబ ప్రార్థనకు కూర్చున్నారు. "దయచేసి ఆ షర్ట్ కోసం ప్రార్థించడం మరవవద్దు" అంటూ టిమ్మీ అందరికి గుర్తు చేశాడు.

వెంటనే ఆ తల్లి ఒక నోట్ బుక్ తీసుకొని దాంట్లో "ఔను" అని రాసింది. యిక ఈ షర్ట్ కొరకు ప్రార్థించే పనిలేదు టిమ్మీ అంటూ పెద్దగా నవ్వింది.

"ప్రభువు మన ప్రార్థనలు ఆలకించాడు."

"ఔను ఆలకించాడా."

"ఔను."

వాళ్ళల్లో ఒకరు వెళ్ళి ఆ షర్ట్ తీసుకొచ్చి బల్లమీద పెట్టారు. టిమ్మీ పట్టరాని సంతోషంతో కళ్ళు పెద్దవి చేసుకొని ఆ షర్ట్ వంకచూచాడు. యింతలో మరొకరు వెళ్ళి యింకొక షర్ట్‌ను తీసుకొచ్చాడు. అలా ఒక్కొక్కటి, ఒక్కొక్కటి పన్నెండు షర్ట్‌లవరకు తీసుకొనివచ్చారు పెద్ద కుప్పగా వేశారు. టిమ్మీ అనుకుంటున్నాడు, ఒకవేళ దేవుడే ఆ చొక్కాల బిజినస్ చేస్తున్నాడేమోనని. యిలాంటి సంఘటనలు జరిగినప్పుడు పరలోకంలో దేవుడు లేడని చెబితే ఆ కుర్రాడు వింటాడా, పిల్లలయొక్క అక్కరలు తీర్చడానికి దేవునికెంతో ఆసక్తి అంటే వాడు వినకుండ ఉంటాడ చెప్పండి.

దేవుడు మన ప్రార్థనలకు ప్రతిసారి "ఔను" అని చెప్పడు, ఏలీయా యొక్క తర్వాతి ప్రార్థనా విన్నపానికి "కాదు" అని జవాబు వచ్చింది. యిక్కడ మనం మన పిల్లలు తెలుసుకోవాల్సిన సత్యమేమంటే దేవుడు ఒకవేళ "కాదు" అని చెప్పినా దానికికూడ ఔను అన్నంత విలువయున్నది అని. ఒక ప్రార్థనా పట్టికల పుస్తకం ఉపయోగించడం మంచిదని సలహా యిచ్చిన వ్యక్తి ఇక్కడ దేవుడు "కాదు" అని చెప్పడానికి కూడ ఒక ఉదాహరణ వివరణయిస్తున్నాడని చెబుతున్నాడు. ఒక సారి అతను అతని భార్య యింకా ఎక్కువ మంది పిల్లలనివ్వండి ప్రభువా అని ప్రార్థించారు. దేవుడు వారికి బిడ్డపుట్టేవరకు వారికి జవాబిచ్చినట్లుగానే వారికి అనిపించింది. కాని ఆ బిడ్డ చనిపోయాడు. ఆ తండ్రి యింటికొచ్చాడు ఆ వాకిలి దగ్గర తన నల్గురు కుమారులు నిలబడి యుండడం చూచాడు, "ఓ డాడీ, ఆ శిశువు ఆడా మగా?" అని ఎంతో కుతూహలంతో అడిగాడు. కాని ఆ తండ్రి ఎంతో మౌనముగా వారిని ప్రార్థనా గదిలోకి తీసుకొనివెళ్ళి ఆ ప్రార్థనాపట్టికల పుస్తకం తెరచి దాంట్లో "కాదు" అని వ్రాసాడు. తర్వాత అతనిలా వ్యాఖ్యానించాడు: "నీవు ఇరవై డజన్ల ప్రసంగాలు ప్రార్థన అనే అంశం మీద గుప్పించే కంటే యిలాంటి ఒక అనుభవం ద్వారా నీ సందేశాన్ని వారికందించగలవు."

## జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము

"జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము" అనే పాఠ్యభాగానికి మరలా వద్దాం. ఏలీయా ప్రార్థన *ఎందుకు* అంగీకరించబడి జవాబు లభించింది; ప్రస్తుతం దీన్నంతటిని ఒక్కసారి సంక్షిప్తపర్చుదాం. అలా చేయక ముందు యింత శక్తివంతమైన ప్రార్థనాపరుని గుణగణా లేంటో ఒకసారి పరీక్షించి చూద్దాం:

మొట్టమొదటిగా, అతడు విశ్వాసముగల మనుష్యుడు. యాకోబు అంటున్నాడు, "విశ్వాసముతో అడగాలి" (యాకోబు 1:6). దేవుడు వర్షం యిస్తానని వాగ్దానం చేశాడు, అలాంటప్పుడు ఏలీయా మనసుతో ఎలాంటి సందేహం లేదు. అందుకే అతను "విస్తారమైన వర్షము వచ్చునట్లుగా ధ్వని పుట్టుచున్నది" అని చెప్పగలిగినాడు (41 వచనం). దీన్ని వింటుంటే నాకు లాజరును సమాధినుండి లేపడానికి *ముందు* ప్రార్థించిన యేసు గుర్తుకొస్తున్నాడు "యేసు కన్నులు పైకెత్తి – తండ్రీ నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" (యోహాను 11:41).

రెండవదిగా, అతడు దేవుని మీద పూర్తిగా ఆధారపడిన వ్యక్తి. దీన్ని గురించి ఆలోచించుము: దేవుడు వర్షమిస్తానని వాగ్దానం చేశాడు. విశ్వాసపు చెవితో ఆ విషయం గురించి వర్షపు రాకను తెలిపే శబ్దాన్ని విన్నాడు. అలాంటప్పుడు ఏలీయా ఎందుకు ప్రార్థన చేయవలసి వచ్చింది? మనం కూడ కొన్ని సారులు వాదిస్తాం "మన అనుదిన అక్కరలు దేవునికి తెలుసు కదా అలాంటప్పుడు ప్రార్థన చేయడమెందుకు?" అని (మత్తయి 6:33). "మనం మన పాపాల విషయం పశ్చాత్తాపపడుతున్నాం కదా మరలా క్షమాపణ అడగడమెందుకు ప్రభువే క్షమిస్తానని వాగ్దానం చేశాడుగదా?" అంటూ వాదనలోకి దిగుతాం. దీనికిదిగోండి జవాబు, దేవుడు అతనిని ప్రార్థన చేయుమనికోరినాడు ఎందుచేతనంటే వర్షమనేది పరలోకంనుండి వచ్చే గొప్ప ఆశీర్వాదం అని అతణ్ణి ఒప్పింపజేయడానికి, – ఏలీయా కూడ యిలాంటి ప్రణాళికకు సరిగ్గా సరిపోయిన వ్యక్తి. అదేవిధంగా దేవుడు కూడ ప్రతి ఆశీర్వాదము తన దగ్గరనుండి వచ్చేదేనని మనం పూర్తిగా ఆయన మీద ఆధారపడవలసియుందని మనలను ఒప్పింపజేస్తాడు.

బహుశ ఈ మాటలను మీ బైబిలు కవరు మీద వ్రాసిపెట్టుకుంటె ఎంతైనా మంచిదని నేననుకొంటున్నాను: "నేను ప్రయత్నించినప్పుడు ఓడిపోతాను, నేను నమ్మిక యుంచినప్పుడు, *ఆయన* విజయమొందుతాడు."

మూడవదిగా, అతడు దేవునితో మాట్లాడుటకు సమయాన్ని తీసుకున్న వ్యక్తి. వాస్తవానికి ఆ రోజు ఎంతో బిజిగా ఉన్న రోజు. కాని ఏలీయా దేవునితో మాట్లాడ్డానికి మంచి సమయం తీసుకున్నాడు. మార్కు సువార్తలోని అధ్యాయాన్ని గమనిద్దాం. మన ప్రభువు జీవితంలో ఏబది రెండు రోజులు నమోదుచేయబడినవి. అదే మార్కు సువార్త మొదటి అధ్యాయం అన్నిటికంటె ఆయన బిజీగా ఉన్నట్లు కనబరుస్తుంది. ఆ రోజంతా, ఆయన బోధించడం, ప్రసంగించడం, స్వస్థపర్చడం యింకా యింకా అనేక అద్భుతములు చేయడం జరిగింది. యేసు తన శిష్యులను ఎప్పుడు చురుగ్గా ఉండాలని హెచ్చరించాడు. 35వ వచనం ఆయన సేవను గురించి వివరిస్తుంది: "ఆయన పెందలకడనే లేచి యింకను చాలా చీకటి యుండగానే బయలుదేరి, అరణ్య ప్రదేశమునకు వెళ్లి, అక్కడ ప్రార్థన చేయుచుండెను." యేసు ఎంతో అలిసిపోయి యుండవచ్చు కాని ఆయన ప్రార్థనకు ప్రాధాన్యత యిచ్చాడు.

మనం ప్రార్థనకు సమయమివ్వాలి. అదొక పెద్ద కుటుంబం ఆ తల్లి ఒక సంచారపు పెట్టను తనవెంట తీసుకు వెళ్లేది. ఎక్కడికి వెళ్లినా ఆమె ప్రార్థనకు ప్రాధాన్యతనిస్తు ఆ సంచారపు పెట్టను రహస్యమందున్న దేవునికి ప్రార్థించుటకు వాడుకునేది. "అది ఆమె ప్రార్థనాగది."

నాల్గవదిగా, అతడు బహు ధీనుడు. వాస్తవంగా చూస్తే అతను సామాన్యుడు కాదు. అగ్ని గంధకాల్ని ఆకాశమునుండి దింపిన వ్యక్తి. వేలాది మందిని తుడిచి పెట్టుకు పోయిన అగ్ని

అది, కాని అతనిలో ఇసుమంతైనా గర్వంలేదు. అంతేగాక సర్వలోక సృష్టికర్త ముందు ఘనుడై మోకాళ్ల పై ప్రణమిల్లి తన సంపూర్ణ దీనత్వాన్ని కనబర్చేవాడు. "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృపననుగ్రహించును" (యాకోబు 4:6). కీర్తనాకారుడిలా వ్రాస్తున్నాడు: "బాధపడువారి కోరికను నీవు వినియున్నావు" (కీర్తనలు 10:17).

ఐదవదిగా, అతడు యితరులను గూర్చి ఆలోచించిన వ్యక్తి. అతడొక నిస్వార్థపరుడు. తనకోసమే తాను ప్రార్థించుకోలేదు కాని దురవస్థలోవున్న దేశం కోసం ప్రార్థించాడు. ఏదో తన పంటలకోసం, పశువుల కోసం, కుటుంబం కోసం ప్రార్థించుకోలేదు గాని యితరుల పంట, పశువులు, కుటుంబాల కోసం ప్రార్థించిన వ్యక్తి. యాకోబు యిలా హెచ్చరిస్తున్నాడు, "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరుకుటలేదు" (4:3).

ఆరవదిగా, అతడు ఆసక్తితో ప్రార్థించిన వ్యక్తి. KJV అనువాదం ప్రకారం "నీతిమంతుని విజ్ఞాపన *మనఃపూర్వకమైనదై* బహు బలము గలదై యుండును" (యాకోబు 5:16; నొక్కి చెప్పింది నాది). ఏలీయా ప్రార్థన గురించి యాకోబు యిలా వర్ణిస్తున్నాడు: "అతడు *ఆసక్తితో* ప్రార్థించాడు" (5:17; నొక్కి చెప్పింది నాది). గ్రీకు భాషలో మూలార్థంగా ఏమిచెప్పబడుతుందంటే, "అతను ప్రార్థనతో ప్రార్థించాడు" అని. హెబ్రీ విధానమైన అర్థం దానియొక్క తీవ్రతను వర్ణిస్తుంది. ఔను నిజమే ఏలీయా "ప్రార్థనతో ప్రార్థించాడు." ఔను నిజంగా అతను ప్రార్థించాడు! పౌలు కూడ అదేవిధంగా ఎఫెసీయులకు 6:18లో "ప్రతి సమయమందును ప్రతివిధమైన ప్రార్థనను" అని వ్రాస్తున్నాడు.

ఏడవదిగా, అతడు విడువక విసుకక ప్రార్థించిన వ్యక్తి. అతడు వర్షం రావడం కోసం ఏడు మారులు ప్రార్థించాడు. గతంలో మూడు సార్లు ప్రార్థించాడు, అప్పుడే ఆ మరణించిన బాలుడు తిరిగి జీవించాడు. ఆకాశంనుండి అగ్నిదిగి రావడానికి ఒక్కసారే ప్రార్థించవలసివుంది. ఈ సందర్భంలో మాత్రం అతనొక్కసారే ప్రార్థించాడు, ఏమి జరుగలేదు. మరలా ముమ్మారు ప్రార్థించాడు – యింకా అనేకసార్లు ప్రార్థించాడు. ఆ చనిపోయిన బాలుని లేపడానికి కాని – ఏమి జరగలేదు! బహుశ నేనైతే ఎంతో నిరుత్సాహ పడియుండేవాణ్ణి; "నేను ఊహించుకొంటున్నానేమంటే, బహుశ దేవుడు 'కాదు' " అని చెబుతున్నాడేమోనని. కాని ఏలియా మాత్రం విడువక ప్రార్థించాడు. అతని ప్రార్థన ఆలకింపబడింది. యేసు తన శిష్యులను విసుకక నిత్యము ప్రార్థించుమని ప్రోత్సహించాడు. ఒక సారి వారికి వివరిస్తూ ఒక ఉపమానాన్ని చెప్పాడు "వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు" (లూకా 18:1). "ప్రార్థనయందు నిలకడగా ఉండి ... దానియందు మెలకువగా ఉండుడి" అని పౌలు చెప్పాడు (కొలొస్సయులకు 4:2).

జవాబు లభించే ప్రార్థనలకు వెనుకవున్న "మర్మాన్ని" గురించిన విషయాలను ఇప్పుడు మనం చూడడానికి ముందు పై విషయాలన్నింటిని మనస్సులో ఉంచుకొనండి.

కొంతమంది అనుకొనునట్లుగా "ఈ మర్మమంతా" మూడు మాటల్లోనే ఉందనుకోవద్దు: భాషతో, విస్తారంగా, బిగ్గరగా. "నేను ప్రార్థించలేను" అని కొందరు అనుకుంటారు. "నేను విస్తారంగా దీర్ఘమైన ప్రార్థన చేయలేనే" (విస్తారంగా) అని; యితరులు "ఎలాంటి పదాలు వాడుతారో అలా నేను పదాలు వాడలేను" (భాష) అని అనేవాళ్ళున్నారు; లేక "నేను ప్రార్థన చేస్తే అవతల వాళ్ళు వినలేరు; ఏమనుకుంటారో నాకు సిగ్గుగావున్నది" (బిగ్గరగా) అని అనే

వాళ్ళున్నారు.

"ఈ మర్మం" పై విషయాలన్నిటిలో లేదు. అలాంటప్పుడు ఏంటా మర్మం? మరోసారి యాకోబు తన పత్రికలో చెబుతున్న విషయాన్ని గమనిద్దాం: "*నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలము గలదై యుండును*" (యాకోబు 5:16; నొక్కి చెప్పింది నాది). "మొదటి మర్మం" (సహజంగా మనం అంటుంటాం నోట్లో నాలుక లేనివాడు) అతడే నీతిమంతుడు. "ఈ మర్మాన్ని" ఒక్క మాటలో చెప్పాలంటే *దేవునితో సరైన సంబంధం కల్గియుండుట* అని.

అంగీకారమైన ప్రార్థనకుగల అవసరతను గురించి చదువుతూ ఉండడంలో ఎంతో విలువైయున్నది. ఈ మహోత్కృష్టమైన అంశాన్ని మనమంతా నేర్చుకొనియుండడం ఎంతో మంచిది. యింకా గొప్ప ప్రార్థనా జీవితాన్ని జీవించే ప్రజలంగా ఉండడంలోని కీలకమేమంటె, మనం ఎలాంటి వారమై ఉండాలో అనేది. "నీతిమంతులుగా" ఉండడం ఆధారభూతమైనది. దేవునితో సరిపడి, మరియు ఆయనతో మంచి సంబంధ బాంధవ్యాలు కలిగియుండడం అత్యవసర విషయమై యున్నది.

ఏలీయా ఒక ప్రార్థనాపరునిగా అతని విధానాన్ని మరియు అతని సేవలో అత్యద్భుత ఫలితాలు మన కళ్ళకు కట్టినట్టుగా కనబడుచున్నప్పుడు మనకనిపిస్తుంది – బహుశ అంత స్థాయిలో మన ప్రార్థనా జీవితాన్ని కొనసాగించలేమని. మరలా గమనించండి ఏలీయాను యాకోబు మనకెలా పరిచయం చేస్తూ ఏలీయా పార్థనలెంతో శక్తివంతమైనవి, అతనొక శక్తివంతమైన ప్రార్థనా పరుడు అంటున్నారు. "ఏలీయా దేవుని యొక్క గొప్ప ప్రవక్త" అని యాకోబు అనడంలేదు, లేదా "గొప్ప అద్భుతం చేయువాడు ఏలీయా" అని యాకోబు అనడంలేదు. దానికి బదులు యాకోబు, "ఏలీయా మనలాంటి స్వభావముగలవాడే" అంటున్నాడు (యాకోబు 5:17). ఒకవేళ ఏలీయా శుభ్రంగా అభ్యంగస్నానం చేసివుంటే, చక్కగా క్షౌరం చేయించుకొని, మంచి సూట్ ధరించి సంఘంలో ఒక బెంచీ మీద కూర్చునివుంటే బహుశ అతని సంగతి అసలు పట్టించుకుని ఉండేవాళ్ళం కాదేమో ఎందుకంటె అతను అందరిలో ఒకడు.

ఎందుకీ ప్రార్థనకు జవాబు దొరికింది? అంటే అతనేదో మనకు మించిన స్వభావాలుగలవాడైనందున కాదు. కాని అతను ఎలాంటి సామాన్యమైన వ్యక్తిగా యుండవలసియున్నాడో అలావున్నాడు కాబట్టి.

ఏలీయా యీ విధంగా అంటున్నాడు, "నేను దేవుని ముందు నిల్చున్నాను" (చూడు 1 రాజులు 17:1; 18:15). అతనెప్పుడూ దేవుని సన్నిధిలోయున్నాడు. అతనొకసారి ప్రార్థించాడు అంటే ఏదో ఒక నిబంధనావళిని అనుసరించుచున్నాడని కాదు, ఉదాహరణకు విజయవంతమైన ప్రార్థనకు విప్లవాత్మక మెట్లు అనిగాని అంగీకృత ప్రార్థనకు పదిహేను అవసరమైన సూచనలు అంటూ నియమించిన నియమ నిబంధనావళిని అతడు అనుసరించినందువల్లకాదు. అన్నిటికంటె కూడ తన దేవునితో తాను మాట్లాడుతున్నాడు ఆయనెవరో కాదు ఎవరికైతే తాను పూర్తిగా సమర్పించుకున్నాడో ఆ దేవునితో మాట్లాడుతున్నాడు.

దేవుడతని ప్రార్థననాలకించాడు.

## ముగింపు

దేవునితో నీ సంబంధం ఎలావుంది? నా సంబంధం ఎలా ఉంది? "పరలోకమందున్న మా తండ్రీ" అని మనం నిజంగా ప్రార్థించగలమా? (మత్తయి 6:9). ప్రజలు సహజంగా ఈ ప్రభువు ప్రార్థనను ఆ మాటలనే తిరిగి తిరిగి వల్లిస్తుంటారు సరే మరి మనం "మా తండ్రీ" అని చెప్పడానికి అసలు మనకు హక్కువున్నదా? మనం గనుక మన పాపముల విషయమై పశ్చాత్తాపపడిన విశ్వాసులంగా బాప్తిస్మం తీసుకొననట్లయితే మనం దేవుని పిల్లలం కాము అంటూ బైబిలు బోధిస్తుంది (యోహాను 3:3–5; గలతీయులకు 3:26, 27).

కొందరేమంటారంటే, "నేను ఒక క్రైస్తవునిగా సంపూర్ణంగా సమర్పించు కోవాల్సినప్పటికి అంతగా సమర్పించుకోడానికి నాకిష్టం లేదు." ఆవిధంగా వారు చెబుతున్నారంటే వారి ఆత్మను నిత్యత్వంనుండి దూరం చేసుకుంటున్నారన్నమాట. ఏదైతేనేం అప్పటి ఫలితానికైతే వారు దేవునినుండి వారి సంబంధాన్ని తెంపివేసుకుంటారన్న మాట. లోకంలోవున్న కష్టాలన్ని ఒక్క సారి ఆలోచించండి. మనకు సమస్యలు శ్రమలు వచ్చినప్పుడు దేవుని దగ్గరకు వెళ్ళలేక పోతున్నామంటే ఎంత భయంకరం?

ఒక వేళ నీవు యిప్పటికే బాప్తిస్మం తీసుకొనియుండియున్నట్లయితే దేవుని బిడ్డగా ఆయనతో ఎలాంటి సంబంధ బాంధవ్యాలతో జీవిస్తున్నావో? నీవు నమ్మకమైన బిడ్డగా ఉన్నావా? కొన్నిసార్లు మనం యోహాను 9:31 ప్రస్తావిస్తుంటాం, "దేవుడు పాపుల మనవి ఆలకింపడు" అని. అలా అంటూ యితరులకు కూడ వర్తింపజేస్తుంటాం. ఎలాగైనా యిది అపనమ్మకస్తులైన దేవుని పిల్లలను గూర్చి మాట్లాడుచున్నది. గ్రుడ్డివాడు పాత నిబంధనలోని వాక్యభాగాన్ని ఎత్తిచూపిస్తున్నాడంటే ఎలాంటి సందేహంలేదు, అది కీర్తనలు 66:18 మీద ఆధారపడియున్నది: "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినకపోవును." ఎంత దౌర్భాగ్యకరం, నీ జీవితం గనుక దేవునితో సరైన అనుబంధంలో లేనట్లయితే నీవాయన దగ్గర ఎలా రాగలవు.

జవాబులు లభించే ప్రార్థనకుగల "మర్మమేమంటే," "నీతిమంతుడైన" పురుషుడు, "నీతిమంతురాలైన" స్త్రీ, "నీతిమంతుడైన" యువకుడు, "నీతిమంతురాలైన" యువతి దేవునితో "సరిపడండి." మీ ప్రార్థనలకు జవాబు లభించుటకుగల మర్మమేంటో గ్రహించండి.

---

సూచనలు

[1]నాల్గవ పాఠములోని నోట్సును చూడుము. యిక్కడ కొంచెం సంధిగ్దంగావున్నా ఆ వ్యక్తి యోనా అనుకుంటారు. కాని ఈ వ్యక్తి బహుశ సారెపతు విధవరాలి కుమారుడైయుంటాడు. అహాబు ఏలీయాతో దయగా మాట్లాడుచుండగా అహాబు ఒక సేవకుని ఏలీయాకోసం నియమించెను అనేది యింకొక సాధ్యత కావచ్చు. [2]సీసెరా యొక్క రథం కీషోను వాగు ఊబిలో కూరుకొనిపోయింది (న్యాయాధిపతులు 4:15; 5:21). [3]1 రాజులు 21:1.

---

## దృశ్య సాధనాల-నోట్స్

"జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము" అనే వాక్యాన్ని తరుచు తరుచు సామాన్యంగా వాడడం కొన్ని సార్లు రెచ్చగొట్టినట్లు ఎబ్బెట్టుగా వాడం. ఈ పాఠ్యభాగమంతటిలో

మనం చూస్తాం. అయితే ఆ "మర్మమేదో" చివరిలో "బయలుపడటం" మనం చూస్తాం. ఒక పెద్ద అట్టను తీసుకొని దాని మీద పెద్ద అక్షరాలతో **"జవాబు లభించిన ప్రార్థనల వెనుకనున్న మర్మము"** అని వ్రాయుము. నీవు ఆ మర్మాన్ని బయలుపరచుచున్న కొలది ఆ కార్డులను ఎత్తుగా అందరికి కనబడేలా ఎత్తిచూపిస్తూ ఉండుము. ఎప్పుడైతే "ఆ మర్మాన్ని" పూర్తిగా బయలుపరచాలని అనుకున్నావో వెంటనే ఆ కార్డుముక్కను త్రిప్పి దానివెనుక భాగమును నీవు వ్రాసిన మాటలు చూపుము: **"నీవు 'నీతిమంతుడైన పురుషునిగా' (లేక స్త్రీగావుండుము)."**

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

**పరిచయం**

A. ఏలీయా 450 మంది బయలు ప్రవక్తలను సవాలు చేసిన ఆ రోజు ఏలీయా జీవితంలో గొప్ప రోజు అని అనేకులు భావిస్తారు. దాంతో అంతా ముగిసింది కాదు. యింకా ముమ్మరంగా బయలుపడవలసింది ముందున్నది (గమనించు 18:1).

B. 18వ అధ్యాయంలోని ఈ భాగాన్ని "జవాబు లభించే ప్రార్థన వెనుక ఉన్న మర్మము" అన్న హెడ్డింగుతో చదవండి.

1. ఈ ప్రార్థనను గూర్చిన దృష్టాంతాలను గూర్చి ఆలోచిస్తున్నప్పుడు ఎవరిని గురించి ఆలోచిస్తావు?
2. యాకోబు ఏలీయాను ఎంపిక చేసుకున్నాడు (యాకోబు 5:16బి–18; చూడు ప్రకటన 11:6).

**I. శక్తివంతమైన ప్రార్థన**

A. దేవుడు ఏలీయా ప్రార్థనకు జవాబిచ్చాడు.

1. ఏలీయా సామాన్య మానవునికి దూరముగా, అదే వ్యక్తికి ముఖాముఖి ఎదురుగా రావడం చూచాము. యిప్పుడు దేవునితోనే ముఖాముఖిగా మాట్లాడడం వీక్షిద్దాం.
   a. అహాబుతో: "నీవు పోయి భోజనము చేయుము" (1 రాజులు 18:41బి) పాత నిబంధన అంతటిలో దేవుని అభిషిక్తునికి ఎంతో గౌరవ ప్రతిష్టలున్నాయి.
   b. "విస్తారమైన వర్షము వచ్చునట్లుగా ధ్వని పుట్టుచున్నది" (41ఎ వచనం). ఏలీయా తన విశ్వాసపు చెవితో ఈ శబ్దాన్ని విన్నాడు.
   c. అహాబు ఏలీయాలు వెడలిపోయారు (42బి వచనం) కాని వేరే వేరే కారణాలతో వెళతారు.
   d. ఏలీయా ప్రార్థించడం ప్రారంభిస్తాడు (వచనం 42బి). యిక్కడ "ప్రార్థన" అనే పదం వాడబడలేదు. కాని యాకోబు ఆ విషయాన్ని అతడేమి చేశాడో అన్నదాన్ని నిఖరం చేశాడు (యాకోబు 5:17, 18).

e. ఏలీయా తన సేవకునితో (సారెపతు విధవరాలి కుమారునితో) వెళ్ళి చూడమని చెప్పాడు (వచనం 43ఎ).

f. మొదట్లో ఏమి జరగలేదు (43బి వచనం).

2. ప్రార్థనకు జవాబు యివ్వబడింది.

a. ఒక చిన్న మేఘం కనిపిస్తుంది (44ఎ వచనం). ఏలీయాకు అది చాలు, అతడు అహాబుతో అతని రథాన్ని సిద్ధం చేసుకోమంటాడు (వచనం 44బి). ఔను అప్పుడు "*ప్రచండ వర్షం*" కురిసింది (45ఎ వచనం).

b. ఏలీయా ప్రార్థనకు ఎంత అద్భుతంగా జవాబులభించింది.

(1) ఆ దేశమంత ఆశీర్వదింపబడింది. "భూమి తన ఫలము ఇచ్చింది" అంటూ యాకోబు అంటున్నాడు.

(2) ఏలీయా ఆశీర్వదించబడినాడు. 45బి మరియు 46 చూడండి. ఆ శక్తి ఏలీయాకు ఎలా లభించింది? "*యెహోవా* హస్తము అతనిమీదవున్నది."

(3) యిక్కడ విస్తారమైన ఆశీర్వాదాలు లభించాయి. ఒక్క ప్రక్క అహాబు, అహాబు ద్వారా దేశానికి దేశమే ఆశీర్వదించబడింది.

c. ఏలీయా యెజ్రెయేలు గుమ్మముల వరకు పరుగెత్తుకొని వెళ్లి ఏమి సంభవిస్తుందా అంటు గమనించసాగాడు.

B. ఈ కథ నా జీవితానికెలా వర్తిస్తుంది?

1. ఈ కథ ఏమి చెబుతుందంటే, ప్రార్థనలో గొప్ప శక్తి ఉన్నదని, దేవుడు ప్రార్థనలకు జవాబునను(గ్రహిస్తాడు. యాకోబు 5వ అధ్యాయానికి పయణం:

a. 16వ వచనంలోని మూడు శక్తివంతమైన మాటలు:

(1) *"బహు బలముగలదై"*

(2) "అనుకున్నది *సాధించగలదు"*

(3) "మరి *ఎక్కువగా* సాధించగలదు"

b. దీనికి సరైన ఋజువును యాకోబు 17 మరియు 18వ వచనాల్లో చూపిస్తున్నాడు.

(1) దేవుడు ఏలీయా ప్రార్థనకు జవాబిచ్చాడు.

(2) దేవుడు నీ ప్రార్థనలకు కూడ జవాబిస్తాడు.

2. మనం ఈ పాఠం నేర్చుకోవాలి, మన పిల్లలకు కూడ చెప్పాలి!

## II. జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము

A. ఈ జవాబు అను(గహించు ప్రార్థన వెనుక ఉన్న "మర్మమును" కనుగొనకముందు శక్తివంతమైన ప్రార్థనలకు ప్రతీకగా నిలిచే వ్యక్తి యొక్క గుణగణాలను గూర్చి గమనిద్దాం.

1. అతడు *విశ్వాసముగల* మనుష్యుడు (యాకోబు 1:6).
2. అతడు *దేవుని మీద పూర్తిగా ఆధారపడిన వ్యక్తి.*
3. అతడు *దేవునితోనే మాట్లాడుటకు సమయమును తీసుకున్న వ్యక్తి.*
4. అతడు బహు *దీనుడు.*
5. అతడు *యితరులను గూర్చి ఆలోచించిన వ్యక్తి.*
6. అతడు *ఆసక్తితో ప్రార్థించిన వ్యక్తి.*
7. అతడు *విడువక విసుగక నిత్యము ప్రార్థించిన వ్యక్తి.*

B. ఈ వివరణలతో యిక మనం ఈ జవాబు లభించే ప్రార్థనల వెనుకవున్న మర్మము గ్రహించడానికి సిద్ధంగా ఉన్నాం.
1. కొందరనుకుంటారు మర్మం "ఈ మూడు సూక్ష్మ సూచనల మీద ఆధారపడిందనుకుంటారు":
    a. పొడవు లేక దీర్ఘం
    b. భాష
    c. బిగ్గరగా అరవడం
2. యాకోబు తెల్పేదేమంటే, ఈ "మర్మము" కేవలం *దేవునితో మనకున్న వ్యక్తిగత సంబంధం మీద ఆధారపడివున్నది: "నీతిమంతుని విజ్ఞాపన* మనఃపూర్వకమైనదై బహు బలముగలదైయుండును."
    a. మనం దేవునితో సరిపడాలి.
    b. ఏలీయాలాంటి ప్రార్థనా జీవిత స్థాయికి మనము ఎదగలేమని మనమనుకుంటాం. కాని గమనించండి అతడు "మనలాంటి స్వభావముల మనుష్యుడే." అతని ప్రార్థనలకు జవాబు లభిం- చింది, అతడేమో గొప్ప పరిపూర్ణుడని కాదుగాని అతడు "దేవునిముందు నిలిచాడు" కాబట్టి (1 రాజులు 17:1). మనం కూడ నిలువగలం.

**ముగింపు**

A. దేవునితో నీ సంబంధం ఎలావుంది?
1. మనం "తండ్రీ" అని చెప్పడానికి మనకు హక్కువుందా? (గలతీయులకు 3:26, 27; యోహాను 3:3–5).
2. ఒకవేళ యిప్పటికే మనం దేవుని పిల్లలమైయుంటే, మనం *నమ్మకమైన* పిల్లలుగా ఉంటున్నామా? (యోహాను 3:31; కీర్తనలు 66:18).

B. మీకు సహాయం చేయడానికి మాకు అవకాశమియ్యండి.